సాక్షి ప్రకాశం

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



ఘనంగా గుంటి గంగ తిరునాళ్లు

తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలో గుంటి గంగా భవాని అమ్మవారి తిరునాళ్లను శనివారం ఘనంగా నిర్వహించారు. - 8లో..



నేత్రపర్వం.. తెప్పోత్సవం

రాచర్ల మండలం జేపీ చెరువు సమీపంలోని నల్లమలలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. -10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34 /26

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికం. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా॥ 06:29 ని॥
ఆదివారం

సహర్ : ఉ॥ 04:37 ని॥
సోమవారం

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ ద్వారా నవోదయ హాల్ టికెట్లు

ఒంగోలు: జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్ష రాసే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు పొందాలని ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ టి.జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు పరీక్ష జరుగుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసిన విద్యార్థులు అక్కడే హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి కార్యాలయంలో దరఖాస్తు చేసిన విద్యార్థులు నవోదయ కార్యాలయంలో హాల్‌టికెట్లు పొందాలన్నారు. ఈ నెల 20వ తేదీ కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా హాల్‌టికెట్లు పొందాలని చెప్పారు. విద్యార్థులు దరఖాస్తు చేసే సమయంలో పొందిన రశీదుతో రావాలని సూచించారు.

పది పరీక్షలకు 217 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి పరీక్షలకు శనివారం 217 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ పరీక్షలకు 28,861 మంది హాజరుకావాల్సి ఉండగా, మూడో పరీక్షకు 28,644 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు ఆరు సెంటర్లను, డీఈవో ఒక సెంటర్‌ను, స్క్వాడ్ బృందాలు 57 సెంటర్లను తనిఖీ చేశాయి. ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు సంబంధించి 4,498 మందికిగానూ 4,108 మంది హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు సంబంధించి 1,507 మందికిగానూ 1,289 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు కంభంలో, డీఈవో మార్కాపురంలో, జిల్లా కో ఆర్డినేటర్ దర్శిలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ప్రకటించారు.

బాధను దిగమింగుకుని..!

- ఇంటి వద్ద తండ్రి మృతదేహం
- పదో తరగతి పరీక్షకు హాజరైన కుమారుడు



పరీక్షకు హాజరైన బాబు

కొమరోలు: కన్న తండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉండగా కన్నీరు మున్నీరవుతూనే తప్పనిసరి పరిస్థితుల్లో ఆ బాధను దిగమింగుకుని పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు ఓ విద్యార్థి. కొమరోలు మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన బాబు అదే మండలంలోని కొత్తపల్లె ఎస్‌బీఎస్ ఆర్ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. పరీక్షల ప్రారంభం రోజే తండ్రి బంకు సైదు (44) తీవ్ర అనారోగ్యానికి గురవగా, కడపలోని రిమ్స్‌కు చికిత్స నిమిత్తం బంధువులు తరలించారు. ఈ నేపథ్యంలో సైదు ఆరోగ్యం పూర్తిగా విషమించి శుక్రవారం వైద్యశాలలోనే మృతి చెందాడు. చింతలపల్లెలోని స్వగృహానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. శనివారం అంత్యక్రియలు చేయాల్సి ఉంది. అయితే, బాబుకు ఇంగ్లిషు పరీక్ష ఉండటంతో కన్నతండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉన్నప్పటికీ కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరయ్యాడు. కన్నీళ్లతోనే పరీక్ష రాశాడు. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.



వందేభారత్ రైలును చూసేందుకు వచ్చిన యువత

రైలులో మంత్రి సురేష్, ఎంపీ మాగుంట అభివాదం



రైలును ఫొటోలు తీస్తున్న యువతులు

వందేభారత్ మదిని దోచే..!

ఎప్పుడెప్పుడా అని జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్న సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో అడుగుపెట్టింది. సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ఈ రైలును ప్రారంభించారు. వందే భారత్ రైలు ఒంగోలు వస్తుందని తెలుసుకున్న ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మహిళలు, చిన్నారులు, యువకులు రైలు కోసం ఆతృతగా ఎదురుచూశారు. రయ్..రయ్ మంటూ రైలు ప్లాట్‌ఫాం మీదకు వస్తున్న సమయంలో పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. అత్యాధునిక సౌకర్యాలు, ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ రైలు అందరి మనసు దోచుకుంది. పలు స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని సందడి చేశారు. రైలు వచ్చే దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు. రైలు ఆగాక సెల్ఫీలు తీసుకున్నారు. మరికొందరు రైలు ఎక్కి లోపల ఫొటోలు తీసుకోవడం కనిపించింది. మొత్తం మీద కోలాహల వాతావరణం కనిపించింది.

– సాక్షి, ఒంగోలు



ఒంగోలు రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



రైలును చూసేందుకు వచ్చిన విద్యార్థులు

జగన్ రాక కోసం...

- మార్కాపురంలో చక చకా ఏర్పాట్లు
- పరిశీలించిన మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కేపీ
- సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపు
- అధికారులు అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సురేష్, తలశిల రఘురాం, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

మార్కాపురం: అగ్రవర్ణాలకు చెంది ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈబీసీ నేస్తం రెండో విడత సాయం అందించేందుకు ఈ నెల 12వ తేదీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం రానున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే సభను సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి శనివారం మార్కాపురం ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదిమూలపు సురేష్, తలశిల రఘురాం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి బహిరంగ సభ రోజు చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. పశ్చిమ ప్రకాశం ప్రజలందరూ ముఖ్యమంత్రి రాక కోసం ఎదురుచూస్తున్నారన్నారు.



మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, జంకె, కలెక్టర్, ఎస్పీలతో సమీక్షిస్తున్న తలశిల రఘురాం

ఈబీసీ నేస్తం పథకాన్ని మార్కాపురంలో లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఈబీసీ పథకం లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ దినేష్‌కుమార్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి మార్కాపురం వస్తున్న సందర్భంగా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున సభా ప్రాంగణంలో ఇబ్బంది లేకుండా షామియానాలు ఏర్పాటు చేసి చల్లటి నీళ్లు, మజ్జిగ, స్నాక్స్ అందజేయాలన్నారు. శానిటేషన్, మొబైల్ బాత్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయి అధికారులు వాటి ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈబీసీ లబ్ధిదారులను సచివాలయాల ద్వారా ఎంపిక చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్టేజ్, డెకరేషన్, మైక్ సిస్టం ఏర్పాట్లపై సూచనలు చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. హెలీప్యాడ్ నుంచి సభా స్థలి వరకు రోడ్డుకు ఇరువైపులా షాపులను మూయించవద్దని చెప్పారు. అక్కడక్కడా విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇచ్చే అర్జీలు స్వీకరించేందుకు స్పందన టీంను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సభాస్థలికి వచ్చే ప్రజలు, అధికారులను ఆపి ఇబ్బందిపెట్టొదని, లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డాక్టర్లు, అంబులెన్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురాన, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ మర్ధన్‌అలీ, డీపీవో నారాయణరెడ్డి, ఆర్డీవో అమర్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, మెప్మా పీడీ రవికుమార్, ఫైర్, తదితర శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, అడిషనల్ ఎస్పీ కే నాగేశ్వరరావు, డీఎస్పీ మరియదాస్, కిషోర్‌కుమార్, పల్లపు రాజు, సీఐ భీమానాయక్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, డాక్టర్ కనకదుర్గ, ఎం.మహేశ్వరరెడ్డి, పంబి వెంకటరెడ్డి, గాంధీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అమూల్య

కొమరోలు: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో శనివారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ కామూరి అమూల్య పోటీలను ప్రారంభించారు. నల్లగుంట్ల గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోటీల్లో ఆరు జతల ఎద్దు పాల్గొన్నాయని, గెలుపొందిన ఎడ్ల జతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం మనోజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కామూరి రమణారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, ఎంపీపీ అమూల్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎదురు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హోం నర్స్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు: వయోవృద్ధులు, మంచంపై ఉన్న రోగులకు ఇంటివద్దే సేవలందించేందుకు అవసరమైన 5 రోజుల శిక్షణను ప్రకాశం జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అందించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ కోర్సు చేసిన లేదా పదో తరగతి ఉత్తీర్ణులైన/ఫెయిలైన 40 సంవత్సరాల్లోపు స్త్రీ, పురుషులు అర్హులని చెప్పారు. హోంనర్స్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల జీతంతో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. సేవా తత్పరత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 91547 73116 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కన్నుల పండువగా ఊంజల్ సేవ



స్వామివారి ఊంజల్ సేవలో ఎంపీ మాగుంట, దేవస్థాన చైర్మన్, సభ్యులు

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న శ్రీప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖశాంతులు కలుగజేయాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నాదశ్వర విద్వాంసుడు పతకమూరి సాంబయ్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన నాదశ్వర కచేరి భక్తులను అలరించింది. అనంతరం కళాకారులను ఎంపీ మాగుంట ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాతా ప్రసాద్, అయినాబత్తిన ఘనశ్యాం, రామకృష్ణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, ఈమని మదన్, దార్ల వెంకట రమణమ్మ, గీతాకుమారి, హరిప్రియాదేవి, వి.మురళి, వీరాంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ వీరాంజనేయరెడ్డి, అర్చకస్వాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందన తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాల వలన తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పొదిలి: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన దర్శి రోడ్డులో శనివారం జరిగింది. పోలూరి శరత్‌బాబు (56) కుటుంబ సమస్యల నేపథ్యంలో మద్యానికి బానిసగా మారి ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. ఈక్రమంలో శనివారం దర్శి రోడ్డులో మృతి చెంది ఉన్నాడు. అనారోగ్యంతో లేదా మద్యం తాగి దాహార్తితో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల విద్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

చీమకుర్తి: సంతనూతలపాడు, అమ్మనబ్రోలు, గణపవరం గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు, ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీలో ఇంటర్, డిగ్రీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.మెర్సీ శనివారం తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 24 లోపు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని, వారికి మే 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

రైల్వే చరిత్రలో మైలురాయి

వందేభారత్ రైలు



వందే భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే కరణం బలరాం, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: భారత రైల్వే చరిత్రలో కీలకమై అభివృద్ధికి పునాది వేసిన వందేభారత్ రైలు చిరస్థాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం సికింద్రబాద్‌లో ప్రారంభించిన వందేభారత్ రైలును.. మంత్రి సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డితో పాటు చీరాల నుంచి వందేభారత్ రైలులో ప్రయాణం చేసి వచ్చిన చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంలు స్వాగతం పలికారు. రైలు ఎక్కి సీటింగ్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. డ్రైవర్ క్యాబిన్‌లోకి వెళ్లి ఇంజిన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒంగోలు నుంచి నెల్లూరుకు బయలుదేరిన వందే భారత్ రైలుకు పచ్చ జెండా ఊపారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సౌకర్యవంతంగా ప్రయాణం చేసే అవకాశం లభించిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేంద్రంతో సహృద్భావ వాతావరణంలో కలిసి పనిచేస్తుందని తెలిపారు. వందేభారత్ రైలు అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఆదరిస్తున్నారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. , ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి చూపిన చొరవ కూడా ఇందుకు దోహదపడిందని చెప్పారు. ధరలు తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రైల్వే మంత్రి తెలిపారని చెప్పారు. ప్రస్తుతం సికింద్రబాద్–తిరుపతికి వందేభారత్ రైలు వేసినట్లే త్వరలో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా ఆంధ్ర ప్రదేశ్‌కు రానున్నాయని వెల్లడించారు. వందేభారత్ రైలు ప్రయాణం మంచి అనుభూతిని కలిగించిందని చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం అన్నారు. ఆహార వసతి కల్పిస్తే బాగుంటుందని చెప్పారు. చీరాలలో కూడా వందేభారత్ రైలును ఆపాలని, ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం మహేష్, తాతా ప్రసాద్, ఘన శ్యాం, నాదెండ్ల సుధాకర్, ఎం.మల్లికార్జునరెడ్డి, పుట్టా సుధాకర్ రెడ్డి, దారా పద్మజ, గోగినేని వెంకటేశ్వర్లు, చెరుకూరి ఆదిలక్ష్మి , రైల్వే అధికారులు సీఐ శబరీనాథ్, సీబీఎస్‌ఆర్ వీరభద్రారెడ్డి, ఎస్ఎంఆర్ యేసుదానం, టీటీఐ ఆర్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యంగా ఉంది:



వందేభారత్ రైలులో ప్రయాణం గొప్ప అనుభూతి మిగిల్చింది. చాలా సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా ఉద్యోగులకు, విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుంది. అలాగే తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు సమయం కలిసి వస్తుంది.

– ఎస్.పూర్ణచంద్రరావు, ఆంధ్ర బ్యాంకు ఉద్యోగి,గుంటూరు

కలగా అనిపించింది:



వందేభారత్‌లో తొలిరోజే ప్రయాణం చేస్తానని అనుకోలేదు. కేంద్రీయ విద్యాలయలో 8వ తరగతి చదువుకునే నా కుమారుడు అల్తాఫ్‌తో కలిసి గుంటూరు నుంచి ఒంగోలు వరకు ప్రయాణం చేశాను. చాలా సంతోషంగా ఉంది. ఇది కలగా అనిపించింది.

– పఠాన్ ఫర్హానా ఖాతున్, గృహిణి, గుంటూరు

పది విద్యార్థి దుర్మరణం

- ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ఘటన
- పరీక్షలకు హాజరై వస్తూ విగతజీవిగా మారిన వైనం



మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి, బంధువులు

పెద్దదోర్నాల: శ్రీశైలం ఘాట్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి పరీక్ష రాసి వస్తున్న గిరిజన విద్యార్థి దుర్మణం పాలయ్యాడు. వివరాలు.. పెద్ద దోర్నాల మండలం కొర్రప్రోలు గిరిజన గూడేనికి చెందిన భూమని మూగెన్న, హనుమక్కల కుమారుడు రవీంద్ర (16) చింతల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం పరీక్ష రాసేందుకు దోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చాడు. పరీక్ష పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు చింతల గిరిజన గూడెం చేరుకున్నాడు. అయితే స్నేహితుని బైకు ఘాట్ రోడ్డులో నిలిచిపోవటంతో ఆ బైక్‌ను తీసుకుని వచ్చేందుకు మరో బైక్‌పై ఘాట్‌లోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఘాట్‌లో ఆగిన బైక్‌ను రవీంద్ర ఒక్కడే తీసుకుని చింతలకు పయనమయ్యాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సొన్నూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బైకును ఢీ కొనటంతో రవీంద్ర దుర్మణం పాలయ్యాడు. కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.



మృతుడు రవీంద్ర(ఫైల్)

తండ్రి మృతి చెందిన రెండు నెలలకే..

మృతుడు భూమని రవీంద్రకు తల్లి భూమని హనుమక్క, పెళ్లయిన మరో సోదరి ఉన్నారు. ప్రమాదంలో మృతి చెందిన రవీంద్ర తండ్రి భూమని మూగెన్న అనారోగ్యంతో రెండు నెలల కిందట మృతి చెందగా, శనివారం రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందటంతో తల్లి హనుమక్క హృదయ విదారకంగా రోదించటం అందరినీ కలిచి వేసింది. చదువులో రాణిస్తూ పదో తరగతి పరీక్షలు రాస్తున్న తన కుమారుడు ప్రయోజకుడయ్యాడన్న ఆనందాన్ని ఆ దేవుడు తనకు మిగల్చకుండా చేశాడంటూ విలపించింది. నల్లమల అభయారణ్యంలోని సంఘటనా స్థలంలో కుమారుడి పాదాలను ముద్దాడుతూ ఆ తల్లి పడ్డ వేదన చూపరులకు కంట నీరు తెప్పించింది.

మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి

పుల్లలచెరువు: మోటార్ సైకిల్‌పై ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి పడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోమరోలు వద్ద శనివారం ఉదయం జరిగింది. యండ్రపల్లి కంచపోగు ఇజ్రాయేల్ (20) వై. పాలెం నుంచి పని ముగించుకుని యండ్రపల్లికి మాచర్ల ప్రధాన రహదారిపై వస్తుండగా కోమరోలు మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పక్కన ఉన్న పొలాల్లో పడిపోవడంతో ఇజ్రాయిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కన ఉన్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయడంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఏఎస్ఐ సుబ్బమ్మ తెలిపారు. మృతునికి భార్య 10 నెలల గర్భిణి కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతి చెందిన ఇజ్రాయేల్

ఘనంగా గుంటి గంగ తిరునాళ్లు



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే మద్దిశెట్టి, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర

తాళ్లూరు: గుంటి గంగా భవాని తిరునాళ్ల శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం వద్ద శనివారం ఉదయం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక శాంతి, గావు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే భక్తుల రాకతో గుంటి గంగా భవాని ప్రాంగణం భక్తులతో కిట కిటలాడింది. మహిళలు, రైతులు ట్రాక్టర్లలో అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పొంగళ్లను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగా భవాని ఆలయంతో పాటు శివాలయం, శ్రీకాశినాయన ఆశ్రమం, శ్రీ క్రిష్ణాలయం, బ్రహ్మంగారి దేవాలయం, నాగుల స్వామి పుట్ట భక్తులతో కిట కిటలాడాయి. వివిధ కులాలకు చెందిన సత్రాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీలక్ష్మి శ్రీనివాస మార్బుల్స్, టైల్స్ చీమకుర్తికి చెందిన వారు లడ్డూ, పులిహోర, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు మజ్జిగ, ప్రసాదాలు అందించారు. ఈవో భాస్కరరెడ్డి, సిబ్బంది శ్రీనివాసరావు, పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీపీలు కోట రామిరెడ్డి, పోశం మధుసూదన రెడ్డి, జి. మోషే, జిల్లా కోఆప్షన్‌మెంబర్ షేక్ ఆదాం షరీఫ్, పలువురు నాయకులు స్వాగతం పలికారు.

ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి పూజలు

ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ. వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జున రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

గుంటిగంగాభవానీ తిరునాళ్లకు దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, మూడు ప్రత్యేక పార్టీలకు చెందిన దాదాపు 600 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో దర్శి సీఐ రామకోటయ్య, ఎస్సై ప్రేమకుమార్ పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలలో వేచి ఉన్న భక్తులు

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

- ఎస్పీ మలికా గర్గ్

మార్కాపురం: ఈ నెల 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈబీసీ నేస్తం ప్రారంభానికి మార్కాపురం వస్తున్న సందర్భంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. శనివారం మార్కాపురం వచ్చిన ఆమె సీఎం పర్యటనపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా ఒక్కో విభాగానికి ఒక్కో ఇన్‌చార్జిని నియమించామని..పూర్తి స్థాయిలో బందోబస్తు కూడా కల్పించినట్లు చెప్పారు. వీవీఐపీల వాహనాల రాక, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం , నిష్క్రమణ స్థలాలను, హెలీప్యాడ్ నుంచి సభ ప్రాంగణం వరకు ఉన్న రూట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణంలో సభా వేదిక, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో హెలీప్యాడ్ ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాలు, బారికేట్ల ఏర్పాటు, సీఎం కన్వాయ్ రూట్, చుట్టూ ఉన్న ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ మరియదాస్, మార్కాపురం డీఎస్పీ కిషోర్‌కుమార్, దిశ డీఎస్పీ పల్లపు రాజు, సీఐ భీమానాయక్, ఎస్సై సుమన్, శశికుమార్ తదితరులున్నారు.



భద్రతా ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ఎస్పీ మలికా గర్గ్